

కదిరిలో చలిమంటలు వేసుకున్న వ్యాపారులు

గజ గజ..!



- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- కమ్మేస్తున్న పొగమంచు
- వణికిపోతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

కదిరి/ఓబుళదేవరచెరువు/కొత్తచెరువు/మడకశిర, జనవరి6 (ఆంధ్రజ్యోతి): చలి వణికిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. సాయంత్రం నుంచి ఉదయమైనా మంచు దుప్పటి వీడట్లేదు. దీంతో జనం గజగజ వణికిపోతున్నారు. చలి దెబ్బకు తెల్లవారుజామున ఎవరూ బయట కనిపించట్లేదు. చలిమంటలు కాస్తున్నారు. తెల్లవారుజామునే పనులకు వెళ్లే చిరుద్యోగులు, వ్యాపారులు, రాత్రి సమయంలో పనిచేసే ఇతర వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంటిపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారి ఇబ్బందులు వర్ణనాతీతం. వీరు జాగ్రత్తలు తీసుకోకుంటే, ఇబ్బందే అని డాక్టర్లు సూచిస్తున్నారు. సాధారణ ప్రజలు కూడా చలికి జాగ్రత్తలు తీసుకోకపోతే జలుబు, దగ్గులాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిసున్నారు. కదిరిలో 14 డిగ్రీల సెంటీగ్రేడ్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఉదయం 7 గంటల సమయంలో కూడా ఇదే ఉష్ణోగ్రత ఉంటుండడం గమనార్హం. ఉదయం 10 గంటలైనా మంచు వీడట్లేదు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదుటి వాహనాలు కనిపించక భయంభయంగా ప్రయాణిస్తున్నారు. ఉదయం పూట కూడా లైట్లు వేసుకుని వెళ్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

దీర్ఘకాలికంగా ఆస్తమా, అలర్జీతో భాదపడేవారు ఉదయం వేళల్లో బయటకు రాకూడదు.

ఇంట్లోనే ఉన్నా తలుపులు, కిటికీలు పూర్తిగా మూసి వేసుకోవాలి.

ఫ్రిజ్‌లోని పదార్థాలను నేరుగా వినియోగించరాదు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి.

తినుబండారాలు వేడిగా ఉన్నపుడే తీసుకోవాలి.

తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే స్వెట్టర్లు, మంకీ క్యాపలు, మాస్కులు ధరించాలి.

చంటి పిల్లలను ఉదయం 9 గంటల్లోపు, రాత్రి 7 తరువాత బయటకు తీసుకురాకూడదు.

ఇంట్లో కూడా స్వెట్టర్లు, సాక్సులు వేయాలి.

గోరువెచ్చని నీటిని తాగించాలి.

వీలైనంతవరకు ప్రయాణాలు చేయరాదు.

చర్మం పగలకుండా ప్రెటోలింగ్ జెల్లీ కానీ, కొబ్బరినూనెకానీ రాయాలి.

దగ్గు, జలుబు ఉన్న పిల్లల నుంచి దూరంగా ఉంచాలి.

పడిపోయిన ఉష్ణోగ్రతలు

కదిరిలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రత్త 14 డిగ్రీలలుగా నమోదవుతోంది. కదిరి ప్రాంతంలో ఎన్నడూలేనంతగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎంతోమంది చలికి తట్టుకోలేక చలిమంటలు వేసుకుంటున్నారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు ధరించి బయటకు వస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పెరిగిన చలి తీవ్రత కారణంగా చంటిపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలికంగా అలర్జీ, ఆస్తమాతో బాధపడేవారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వీరు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. లేదంటే ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతాయని హెచ్చరిస్తున్నారు. చంటి పిల్లలను ఉదయం 9 గంటల తరువాత, రాత్రి 7 గంటలలోపు మాత్రమే బయటకు తీసుకువారాలని సూచిస్తున్నారు. వృద్ధులు కూడా జాగ్రత్తలు పాటించాలంటున్నారు.



కొత్తచెరువు వద్ద పొగమంచులో పక్షులు



మడకశిరను కప్పేసిన పొగమంచు

అంత సీన్ లేదు..!



- హెచ్‌ఎంపీవీకి భయపడొద్దు
- జాగ్రత్తలు పాటిస్తే నయమౌతుంది
- కొత్త వైరస్ గురించి వైద్య నిపుణులు

కొవిడ్ అనుభవాల నేపథ్యంలో చైనాలో వైరస్ అనగానే జనంలో గుబులు మొదలౌతోంది. లేనిపోని భయాలు వెంటాడుతున్నాయి. తాజాగా హెచ్‌ఎంపీవీ గురించి అలాంటి ఆందోళనే నెలకొంది. కానీ దీనికి అంత సీన్ లేదని వైద్య నిపుణులు అంటున్నారు. సాధారణ వైద్యంతో నయమౌతుందని, జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని భరోసా ఇస్తున్నారు. బెంగళూరులో రెండు కేసులు బయటపడిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి, అనంతపురం మెడికల్ కాలేజీ మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంకను ఆంధ్రజ్యోతి సంప్రదించింది. హ్యూమన్ మెటానిమో వైరస్ ప్రభావం, జిల్లాలో పరిస్థితి గురించి ప్రశ్నించింది.

ఆ వివరాలు 6లో..

దిష్టిబొమ్మల్లా ఆర్ఎస్కేలు..!

సచివాలయాల్లో సిబ్బంది సేవలు.. 7

అక్కడే పంటల నమోదు





రైతు చింతా చంద్రశేఖర్

అదిరిందయ్యా... చంద్రం..!

- దానిమ్మ సాగుతో సిరుల పంట
- రూ.1.21 కోట్లు ఆర్జన

విరగ్గాసిన దానిమ్మ

కష్టపడితే కర్షకుడూ కోటీశ్వరుడు అవుతాడని నిరూపించాడు ధర్మవరం మండలం చిన్నూరు బత్తలపల్లికి చెందిన రైతు చింతా చంద్రశేఖర్. ఈ ఏడాది వరుస తుఫాన్లు, ఎడతెరపిలేని వానలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అన్ని పంటలను తెగుళ్లు చుట్టుముట్టాయి. ఉధృతంగా వ్యాపించాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. చాలామంది వదిలేసుకున్నారు కూడా. దానిమ్మ పంట పరిస్థితి వేరే చెప్పక్కర్లేదు. సాధారణంగానే ఈ పంటకు తెగుళ్లు విపరీతంగా వ్యాపిస్తాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో మరింత ఉధృతంగా సోకుతాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ పంటను కాపాడుకోగలిగాడు చింతా చంద్రశేఖర్. తెగుళ్లు సోకిన వెంటనే గుర్తించడంతోపాటు నివారణకు మందులు పిచికారీ చేశాడు. అలా పంటను కాపాడుకున్నాడు. ధరల రూపంలో రైతును అదృష్టం వరించింది. తెగుళ్ల దెబ్బకు దేశవ్యాప్తంగా పంట దిగుబడులు తగ్గిపోవడంతో ధర ఆకాశాన్నంటుతోంది. టన్ను రూ.1.74 లక్షలతో పొలంలోనే పంటను విక్రయించాడు చంద్రశేఖర్. ఏకంగా 70 టన్నుల దిగుబడి సాధించి.. రూ.1.21 కోట్లు ఆర్జించాడు. రైతు లాభాలను ఆర్జించడం వరుసగా ఇది మూడోసారి.

- తెగుళ్ల బారి నుంచి కాపాడుకున్న రైతు
- పదెకరాల్లో 70 టన్నుల దిగుబడి
- టన్ను రూ.1.74 లక్షలతో విక్రయం
- మూడేళ్లుగా లాభాలు గడిస్తున్న చింతా చంద్రశేఖర్



ధర్మవరం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరుబత్తలపల్లికి చెందిన రైతు చింతా చంద్రశేఖర్ మూడేళ్లుగా దానిమ్మ సాగుతో లాభాలు ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. రైతు తనకున్న పదెకరాల్లో దానిమ్మ సాగుచేశాడు. మూడేళ్ల క్రితం తోటి రైతుల సలహాలతో జైన్‌టిస్ కల్చర్ అనే మొక్కలను మహారాష్ట్రలోని బీజాపూర్ నుంచి తీసుకొచ్చి, నాటాడు. పదెకరాల్లో 3,400 మొక్కలు పెట్టాడు. క్రమం తప్పకుండా ఎరువులు, మందులు వేస్తూ పంటను కాపాడుకున్నాడు. దిగుబడి కోసం రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటను కాపాడుకుంటున్నాడు. పంట దిగుబడి కోసం ఏటా 80 ట్రాక్టర్ల వరకు పశువుల ఎరువు, వేపచెక్క, వర్మీకంపోస్టు వేస్తున్నాడు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. కాయలు కాసిన తర్వాత వాటికి రక్షణగా కవర్‌ను తొడిగాడు. ప్రస్తుతం పంట కోతకొచ్చింది. ఈ ఏడాది మొదటి కటింగ్‌లోనే 70 టన్నుల దిగుబడి వచ్చినట్లు రైతు తెలిపాడు. టన్ను ధర ఏకంగా రూ.1.74 లక్షలు పలకడం రైతుకు కలిసివచ్చింది. తమిళనాడుకు చెందిన వ్యాపారులకు టన్ను రూ.1.74 లక్షలకు పొలంలోనే విక్రయించాడు రైతు. 70టన్నులకుగాను రూ.1.21కోట్లు ఆర్జించాడు. ఇందులో రూ.35లక్షలు పెట్టుబడి పోను రూ.86 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆ రైతు సంతోషం వ్యక్తం చేశాడు. రెండో కోతలో పది టన్నులదాకా దిగుబడి వస్తుందని రైతు తెలిపాడు. గతేడాది 100 టన్నుల దిగుబడి వచ్చినా ధర లేకపోయిందన్నాడు. ఈసారి ధర బాగుండడంతో దిగుబడి తగ్గినా లాభాలను ఆర్జించాడు.



పంటకు రక్షణగా కవర్‌ను కప్పేసిన దృశ్యం

పంట పండించాలనే సంకల్పంతో..

ఈ ఏడాది వాతావరణ మార్పులు, తుఫాన్ల వర్షాలు కురవడంతో దానిమ్మ పంట పండదని రైతులు నిర్ణయానికొచ్చారు. రైతు చింతా చంద్రశేఖర్ మాత్రం పంటను కాపాడుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డాడు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. రేయింబవళ్లు పొలం వద్దనే ఉంటూ.. పంటకు సోకిన తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ.. వాటికి మందులు పిచికారీ చేస్తూ వచ్చాడు. పంటను కాపాడుకున్నాడు. లాభాలు ఆర్జించాడు.



దానిమ్మ పంట దిగుబడి

కుటుంబంలో అందరూ కష్టపడ్డాం

కుటుంబసభ్యులందరం కష్టపడ్డాం. ఈ ఏడాది వరుస తుఫాన్లు, వాతావరణ మార్పులతో పంట ఫెయిలవుతుందని భయాందోళన ఏర్పడింది. ఎప్పటికప్పుడు పంటకు ఎరువులు, మందులు పిచికారీ చేశా. తెగుళ్లను నివారించుకున్నా. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడంతో సంతోషంగా ఉంది.

- చింతా చంద్రశేఖర్, చిన్నూరుబత్తలపల్లి, ధర్మవరం మండలం

రేకులకుంట ఉపాధ్యాయురాలి ప్రతిభ

- ఉమ్మడి రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం



న్యాయమూర్తి నుంచి మెమెంటో, ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు విజయభార్గవి

కొత్తచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నిర్వహించిన మహిళా టీచర్ల వేడుకల్లో జిలాకు చెందిన ఉపాధ్యాయురాలు విజయభార్గవి ప్రతిభ చాటారు. హైదరా బాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 5వతేదీన వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో మడకశిర మండలం రేకులకుంట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయభార్గవి సత్తాచాటారు. ఆమె ఏర్పాటుచేసిన కృత్రిమ మేధ ప్రదర్శనకు ప్రథమ బహుమతి దక్కింది. దీంతో ఆమెకు రూ.5వేలు నగదు, ప్రశంసాపత్రం, మొమెంటోను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ రాధారాణి అందజేశారు. దీంతో ఆమెను జిల్లా విద్యాధికారి కిష్టప్ప, పాఠశాల హెచ్‌ఎం గిరిజ, తోటి టీచర్లు అభినందించారు.

నేడు జిల్లాకు కేంద్ర కరువు బృందం

- రేపు ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో పరిశీలన

పుట్టపర్తి, జనవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటల పరిశీలనకు కేంద్ర కరువు బృందం మంగళవారం రానుంది. పంటనష్టంపై క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించనుంది. కేంద్ర బృందం సభ్యులు బెంగుళూరు నుంచి రోడ్డుమార్గాన మంగళవారం రాత్రికి పుట్టపర్తికి చేరుకుంటారు. బుధవారం ఉదయం జిల్లాలోని ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో వేరుశనగ, కంది, జొన్న, ఉలవ పంటలను పరిశీలిస్తారు. పంటల సాగు, వర్షాభావ పరిస్థితులు, నష్టంపై రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. గత ఖరీఫ్‌లో జిల్లాలో వర్షాభావ పంట నష్టంతోపాటు వివిధ అంశాల ప్రాతిపదికన మూడు మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో పాక్షికంగా ఉందని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. అందులో తీవ్ర కరువు మండలాలుగా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపులను గుర్తించింది. కనగానిపల్లి, ధర్మవరం, నంబులపూలకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను పాక్షిక కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. కరువు మండలాల్లో 45,845 హెక్టార్లలో పలు పంటల సాగు చేసి నష్టపోయిన 46,836 మంది రైతులకు కేంద్ర సాయం రూ.38.97 కోట్లతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.62.46 కోట్లు పరిహారంగా ఇవ్వనుంది. ఈ నివేదికపై కేంద్రం ఇచ్చే సాయంపై జిల్లాలో బుధవారం కేంద్ర కరువు బృందం పర్యటిస్తోంది. జిల్లాలో 32 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయనీ, 10 మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల మిగతా ప్రాంతాల అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తాము తీవ్రంగా నష్టపోయామనీ, తమను ఆదుకోవాలని జిల్లాలో పర్యటించే కరువు బృందానికి విన్నవించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

పింఛన్ల పరిశీలన ప్రారంభం

పుట్టపర్తిటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న వారి ధ్రువపత్రాల పరిశీలన సోమవారం జిల్లాలో ప్రారంభమైంది. పుట్టపర్తి డివిజన్‌లోని బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, గోరంట్ల మండలాల్లో సోమవారం పింఛన్ ధ్రువపత్రాల పరిశీలనను వైద్యుల బృందం చేపట్టింది. వారంలో మూడురోజులపాటు ప్రక్రియ చేపడతారు. రోజుకు 20నుంచి 25మంది ధృవపత్రాలను పరిశీలిస్తారని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

మహిళలే అధికం

- జిల్లా ఓటర్లు 14,12,331 మంది..
- పురుషులు 7,02,416.. మహిళలు 7,09,851 ఇతరులు 64 మంది..



పుట్టపర్తి, జనవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లా ఓటర్ల తుది లెక్క తేలింది. మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ఇతరత్రా సవరణలతో 2025 జిల్లా ఓటర్ల తుది జాబితాను సోమవారం ఎన్నికల అధికారి, కలెక్టర్ టీఎస్ చేతన్ విడుదల చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 14,12,331 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. సర్వీస్ ఓట్లు కలిపి పురుషులు 7,02,416 మంది, మహిళలు 7,09,851 మంది, ఇతరులు 64 మంది ఓటర్లున్నారు. తుది ఓటరు జాబితాలో పురుషుల కంటే 7,435 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. కదిరి, హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో కదిరి నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లున్నారు. తరువాతి స్థానంలో హిందూపురం, మడకశిరలో అతి తక్కువ ఓట్లు ఉన్నట్లు తేలింది.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
మడకశిర	1,06,202	1,05,501	1	75	2,11,779
హిందూపురం	1,25,161	1,25,213	19	84	2,50,477
పెనుకొండ	1,18,162	1,18,345	4	198	2,36,709
పుట్టపర్తి	1,04,472	1,07,211	12	442	2,12,137
ధర్మవరం	1,22,028	1,24,247	20	256	2,46,551
కదిరి	1,25,110	1,29,301	8	259	2,54,678
	7,01,135	7,09,818	64	1,314	14,12,331

అర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 215 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి అర్జీని సంబధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్‌ను జిల్లాలోని సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు తండా, తనకల్లు మండలం ముండ్లవారిపల్లి తండా, గాండ్లపెంట మండలం తుమ్మలబైలు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామన్నారు. సంక్రాంతి తరువాత జిల్లాలో ఎస్సీ కమిషన్ పర్యటన ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు నివేదికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షమ శాఖాధికారి నిర్మలాజ్యోతి.. వార్డెన్లు, సిబ్బందిని వేధించి డబ్బు వసూలు చేస్తున్నారనీ, ఆమెపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర.. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వైద్యాధికారి ఫిరోజాబేగం, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 41 అర్జీలు అందాయి. వాటిని ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులను పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ చేతన్

సమష్టి కృషితో కుష్ఠు నిర్మూలన

అధికారులు, వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజల సమష్టి కృషితో జిల్లాలో కుష్ఠువ్యాధిని నిర్మూలించవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కుష్ఠు వ్యాధి నిర్మూలన పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కుష్ఠువ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేపడతామన్నారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వతేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కుష్ఠువ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తామన్నారు. 6 నుంచి 12 నెలలపాటు చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా వైద్యాధికారి ఫిరోజాబేగం, జిల్లా కుష్ఠు నివారణాధికారి డాక్టర్ తిప్పయ్య పాల్గొన్నారు.

ఫారిన్ లాంగ్వేజ్‌తో ఉపాధి అవకాశాలు



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విదేశీ భాషా నైపుణ్యాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. ఎస్కేయూ-ఆర్డీటీ సంయుక్తంగా నిర్వహించిన ఫారిన్ లాంగ్వేజెస్ ఆన్‌లైన్ కోర్సు ఫలితాలను సోమవారం వీసీ చాంబర్‌లో విడుదల చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ నుంచి జర్మన్ 45, స్పానిష్ 42, ఫ్రెంచ్ 46 మొత్తం 133మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరందరూ ఉత్తీర్ణత సాధించారు. ఫారిన్ లాంగ్వేజ్ పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలో, విదేశాలలో కచ్చితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని వీసీ అనిత తెలిపారు. ఆర్డీటీతో కలిసి కోర్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కృష్ణకుమార్తి, డీన్ నరసింహన్, డైరెక్టర్ రమణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ లోకేశ్వర్లు, సూపరింటెండెంట్ చంద్రారెడ్డి, ఆర్డీటీ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్‌మురళీ, ప్రిన్సిపాల్ గీతాంజలి, జర్మన్ టీచర్ సెశోలియా తదితరులు పాల్గొన్నారు.

చందురుని మించు..

విశాల గగనతలం నుంచి జగతికి చైతన్యం ఒసర్చే దినకరుడు ప్రశాంత ప్రకృతిలో మయూఖతంత్రుల తీవ్రతను వీడి శీతాకాలపు చలికి పగలే వెన్నెల కురిపించే జాబిల్లిలా మారాడు.



చంద్రుని వలే ప్రకాశిస్తున్న.. సూర్యుడు

గత కొన్ని రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. బారెడు పొద్దెక్కినా పొగమంచు ప్రభావంతో వాతావరణం చల్లగా ఉంటోంది. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రభావం ఇంకాస్త ఎక్కువగా ఉంది. అనునిత్యం అరుణ వర్ణంతో ఉదయించే సూర్యుడు మంచు మసుగులో వెండి వెన్నెల పంచే చంద్రుడిలా అగుపిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాడు. ఈ సుందర దృశ్యం బుక్కపట్నం మండలం గసికవారిపల్లిలో సోమవారం ఉదయం అగుపించింది.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

న్యూస్ బాక్స్

సర్టిఫికెట్లు ధ్రువీకరించుకోండి

అనంతపురం విద్య, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాలున్న(సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులు తమ ఒరిజినల్ పీహెచ్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలపై స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకం, సీల్ వేయించి కమలానగర్‌లోని పాత డీఈఓ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 317 మంది విద్యార్థులు ఈ నెల 8,9 తేదీల్లో హాజరై ధ్రువీకరించుకోవాలని ఆయన సూచించారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబరు, డిసెంబరులో ఎంబీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీతోపాటు నాలుగో సెమిస్టర్(ఆర్21) పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంసీఏ మూడో సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ల(ఆర్17,21) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

స్టడీ తర్వాతే చర్యలు

జిల్లా ఆస్పత్రి ఏఓ మల్లికార్జునరెడ్డి



అనంతపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రి ఏఓ(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా మల్లికార్జున రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంగా పలు వివరాలు వెల్లడించారు. తొలుత ఆస్పత్రిలో పరిస్థితులను అధ్యయనం చేసి ఆతర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో కొరవడిన పర్యవేక్షణను మీరెలా సరిచేస్తారు?

ఏఓ: మా మాతృశాఖ రెవెన్యూ డిపార్ట్‌మెంట్. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మమ్మల్ని జిల్లా ఆస్పత్రికి ఏఓగా నియమించారు. కొత్తకాబట్టి ముందుగా ఏఏ విభాగాలు ఉన్నాయి. అక్కడ ఎంత మంది పనిచేస్తున్నారో స్టడీ చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిని చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఏఓ: తొలుత అన్నివిషయాలు తెలుసుకున్న తర్వాత ఆస్పత్రి నియమ నిబంధనలు అందరూ పాటించేలా సూపరింటెండెంట్‌తో కలిసి తగిన ఆదేశాలు ఇస్తాం. అప్పటికీ మారకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఆస్పత్రిలో సమయపాలనను ఎలా సరిచేస్తారు?

ఏఓ: నాతొలి ప్రాధాన్యం నిరంతరం పర్యవేక్షణ చేయడమే. రోజుకు రెండు మూడుసార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తా. అపుడు డ్యూటీలో ఉండాల్సిన వారు ఉన్నారా లేదా అని పరిశీలిస్తాం. ముఖహాజరు వేసిన వారు డ్యూటీ ముగిసేవరకు ఉండాల్సిందే, అలాఉండకుండా ఎక్కడికో వెళ్లి ఉంటే మాత్రం చర్యలు తప్పవు. మరోవైపు గాడిలో పడటానికి అవసరమైతే మూడుసార్లు హాజరు వేసేలా చూస్తాం

ఆంధ్రజ్యోతి: మీదేమో రెవెన్యూ శాఖ మరి డాక్టర్లతో ఎలా కలిసిపోతారు?

ఏఓ: మాది రెవెన్యూ శాఖ అయినా ప్రభుత్వం మాకు ఈ పెద్ద బాధ్యతలు అప్పగించింది. అలాంటపుడు ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది, అందరితో సఖ్యతగా ఉంటూనే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతియంత్రం, పరికరం వినియోగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

అంత సీన్ లేదు..!


హెచ్ఎంపీవీకి భయపడొద్దు

సాధారణ ఫ్లూ లక్షణాలే ఉంటాయి

జాగ్రత్తలు పాటిస్తే నయమౌతుంది

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాంక



అనంతపురం టౌన్/హిందూపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కొవిడ్ తరువాత ఎక్కడ ఏ వైరస్ వచ్చినా విపరీతమైన చర్చ జరుగుతోంది. దాని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, అది హానికరమా కాదా..? వైద్యం అందుబాటులో ఉందా..? వైరస్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..? ఇలా అనేక చర్చలు జరుగుతుంటాయి. తాజాగా చైనాలో ప్రబలుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపీవీ) గురించి అలాంటి చర్చే జరుగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రజలు ఎక్కువగా వెళ్లి వచ్చే బెంగళూరు నగరంలో ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకిందని తెలియగానే ఒక రకమైన కలకలం రేగింది. కానీ ఇదేమీ కొత్త వైరస్ కాదని, పెద్ద ప్రమాదకారి కూడా కాదని వైద్య నిపుణులు అంటున్నారు. దీనికి ప్రత్యేక వైద్యం అంటూ ఏమీ లేదని, అందుబాటులో ఉన్న సాధారణ వైద్యంతోనే నయమౌతుందని కూడా భరోసా ఇస్తున్నారు. బెంగళూరులో రెండు కేసులు నమోదైనట్లు తెలిసేలోగానే బాధిత చిన్నారుల్లో ఒకరు కోలుకోవడం.. ఈ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తోంది. అయితే, వ్యాధి ఏదైనా నిర్లక్ష్యం చేయకూడదు. సొంత వైద్యాన్ని మానేసి.. వైద్య నిపుణులను సంప్రదించాలి. వారి సూచనలకు అనుగుణంగానే ఔషధాలను వాడాలి. లేదంటే ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందులోనూ హెచ్ఎంపీవీ శ్వాసకోశ సంబంధిత సమస్యలను తెస్తుంది. బ్రాంకైటిస్, ఆస్తమా వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది అదనపు సమస్య అవుతుంది. కాబట్టి.. జాగ్రత్తలు పాటించడం, చికిత్స చేయించుకోవడం తప్పనిసరి.

ఇవీ.. లక్షణాలు

హ్యూమన్ మెటానిమో వైరస్ సోకినవారికి సాధారణ ఫ్లూ లక్షణాలు ఉంటాయి. తరచూ జ్వరం వస్తుంది. నీరసంగా ఉంటారు. జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కులో నీరుకారడం, గొంతునొప్పి వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ సోకితే నిమోనియా, ఆస్తమాకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.

ఏం చేయాలి..?

హెచ్ఎంపీవీ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు అంటున్నారు. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. కొవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని అంటున్నారు. ఈ వైరస్ సోకకుండా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. రద్దీగా ఉండే ప్రదేశాలకు అవసరమైతే తప్ప వెళ్లకూడదు. దగ్గినపుడు, తుమ్మినపుడు చేతి రుమాలును అడ్డుపెట్టుకోవాలి. అకస్మాత్తుగా తుమ్ములు వస్తే.. అరచేతిని కాకుండా, చేయి మడిచి.. మోచేతిప్రాంతాన్ని అడ్డుపెట్టుకోవాలి. ఈ పద్ధతిని కొవిడ్ సమయంలో వైద్య నిపుణులు సూచించారు. వైరస్ సోకిన లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి. బయట తిరగకుండా, ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకోవాలి. లక్షణాలు ఉన్నవ్యక్తులు వాడిన వస్తువులను ఇతరులు వాడకూడదు.

భయపడాల్సిన పనిలేదు



హెచ్ఎంపీవీ వైరస్‌తో పెద్దగా భయపడాల్సిన పనిలేదు. ఈ వ్యాధి ఇంతకు ముందు కూడా ఉంది. చైనాలో ఇటీవల ఎక్కువగా ఉందనే వార్త ఆ నోట ఈ నోట వెలువడటంతో ప్రజల్లో భయందోళనలు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల చలి పెరగడంతో కాస్త జలుబు, దగ్గు, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి భయపడాల్సిన పనిలేదు. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. చిన్న పిల్లలను చలి నుంచి కాపాడుకుంటూ ఉన్ని దుస్తులు ధరింపజేయాలి.

-శివకుమార్, చిన్నపిల్లల వైద్యుడు, హిందూపురం

జాగ్రత్తలే రక్ష..



హెచ్ఎంపీవీ వైరస్ ప్రభావం పెద్దగా లేదు. జిల్లాలో ఆ వైరస్ కేసులు నమోదు కాలేదు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. హెచ్ఎంపీ బాధితులకు నిర్దిష్టమైన చికిత్స లేదు, వ్యాక్సిన్ కూడా లేదు. ఇది సాధారణ ఫ్లూ మాత్రమే. జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైరస్ గురించి ఆలోచిస్తున్నాయి. పై నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా జిల్లాలో జాగ్రత్తలు తీసుకుంటాము. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

అంత డేంజర్‌కాదు..



హెచ్ఎంపీవీ వైరస్ కరోనా కన్నా పెద్ద ప్రమాదకరమైనది కాదు. ఈ వైరస్ సోకితే సాధారణంగా వచ్చే జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఇది అంటువ్యాధి. కాబట్టి కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే ఇప్పుడూ తీసుకుంటే సరిపోతుంది. ఈ కేసుల నిర్ధారణకు ఇంకా ఎలాంటి సూచనలు, నిబంధనలు రాలేదు.

- డాక్టరు ప్రియాంక, మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్, మెడికల్ కళాశాల

సారూ.. యాడుండారు?

పత్తాలేని వ్యవసాయాధికారి

సమస్యలతో రైతుల ఇబ్బందులు


ఆందోళన చేసినా తీరుమార్చుకోని ఏఓ



డి.హీరేహాళ్ వ్యవసాయశాఖ కార్యాలయం

డి.హీరేహాళ్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి కృష్ణకిషోర్‌రెడ్డి తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈయన నెలల తరబడి కార్యాలయానికి రాకుండా, విధుల్లో అలసత్వం చూపుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కనీసం ఫోన్‌లో కూడా ఈయన దొరకడని రైతులు వాపోతున్నారు. మండలంలో 30కిపైగా గ్రామాలు కలిగి ఉన్నాయి. ఈ గ్రామాల్లో 80 శాతానికిపైగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయానికి వస్తారు. కానీ ఇక్కడ వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా వ్యవసాయాధికారి కృష్ణ కిషోర్ రెడ్డిని మండలంలో 50 శాత మంది రైతులు కూడా చూడలేదు. మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయం తలుపులు నెలలో ఒక్కసారి కూడా తీయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ అధికారి కొన్నేళ్లుగా గ్రీవెన్స్‌లో గాని, మండల సమావేశంలోగాని పాల్గొనడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు సైతం ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. రైతులు, ప్రజాసంఘాల నాయకులు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించినా ఆ అధికారి తీరులో మార్పు లేదు.

చర్యలు తీసుకోవాలి



నేను మురడి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నా. ప్రజాప్రతినిధిగా వ్యవసాయానికి సంబంధించి ఏవైనా సమస్యల కోసం వెళితే అవి పరిష్కారం కావు. ఎందుకంటే ఆఫీసులో మండల వ్యవసాయాధికారు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. నెలల తరబడి మాలాంటి ప్రజాప్రతినిధులకు కూడా ఆయన అందుబాటులో లేకపోతే ఇక రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఉన్నతాధికారులు ఈయనపై చర్యలు చేపట్టి కొత్త వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నాం.

- గంగాధర, ఎంపీటీసీ, మురడి

విచారించి, చర్యలు చేపడతాం

వారంలో ఒకరోజు తప్ప ప్రతినిత్యం అక్కడ అధికారి రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే. ప్రతి రోజూ ఒక సచివాలయాన్ని సందర్శించి అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకుడితో చర్చించి, రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే త్వరితిగతిన పరిష్కరించాలి. అయితే ఇక్కడ వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండటం లేదన్న విషయం ఈ మధ్యనే మా దృష్టికి వచ్చింది. ఎవరైనా రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మణ్‌నాయక్, ఏడీఏ

మా సమస్యలు పరిష్కరించేదెవరు?



మండలంలో రైతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే అధికారే లేకుండా పోయారు. అసలు మండలంలో వ్యవసాయాధికారి ఉన్నాడో లేడో కూడా అర్థం కావడం లేదు. నేను 40 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. గతంలో సేద్యంలో ఎవైనా సమస్యలు వస్తే అధికారులను సంప్రదించేవాళ్లం. అధికారులు కూడా నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేవారు. కానీ ఈయన విధులలో చేరినప్పటి నుంచి నేటి వరకు ఎప్పుడైనా ఫోన్‌లో మాట్లాడటం తప్ప కనిపించిన దాఖలాలు లేవు. అందుకే అసలు మండల వ్యవసాయ కార్యాలయానికి రావడమే మానేశాం.

- ఎర్రిస్వామిరెడ్డి, రైతు, చెర్లోపల్లి

కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికైంది. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికలకు అధికారి(ఆర్వో)గా వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి వ్యవహరించారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ(రాయదుర్గం), ఉపాధ్యక్షుడిగా రామచంద్ర(అనంతపురం), కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి(అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శశాంకమౌళి ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా ఈశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా జ్యోత్స్న, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్యాంప్రసాద్, శివశంకర్, బృంద, జమీల, టీబీ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గంగపుత్రులుగా పిలువబడే బెస్త కులస్థులు రాజకీయ, ఆర్థిక, విద్య అన్ని రంగాలలో రాణించాలని బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమంలో సోమవారం బెస్తకులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్తలను రాజకీయ పార్టీలు ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. అనేక సమస్యలు, పేదరికంతో బాధపడుతున్న బెస్తలను అన్ని రాజకీయ పార్టీలు సముచితస్థానం కల్పించి ఆదుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జోక్యం చేసుకుని సున్నపుగుట్ట దురాక్రమణ కాకుండా శ్మశానవాటికగానే బెస్తలకు అప్పగించాలని తీర్మానించామన్నారు. బెస్తలకు కులదైవమైన గంగమ్మ దేవాలయానికి స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు.

కమిటీ ఏర్పాటు

గౌరవ అధ్యక్షురాలిగా కమలమ్మ, అధ్యక్షుడిగా గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా పవన్‌స్వామి, కార్యదర్శిగా నాగరాజు, కమిటీ సభ్యులుగా మహేశ్వర్, రాజు, మీ సేవ నాగేంద్ర, ఆర్టీసీ నాగరాజు, టీచర్ ఎర్రిస్వామి, శ్రీరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న బెస్తసంఘం జిల్లా అధ్యక్షుడు

19న గిరిజన ఆదివాసీ సమ్మేళనం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గిరిజన ఆదివాసీ సమ్మేళన సభను విజయవాడలో నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. సమ్మేళనసభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ నిర్వహిస్తామన్నారు. గిరిజనుల జీవన శైలి, సమస్యలు, ఆధునిక జీవన పురోగతి, పరిష్కారమార్గాలు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు, సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్, కేరళ ఐజీ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాం, బెంగళూరు ఎర్రా భాస్కర్‌నాయక్ తదితరులు హాజరవుతారన్నారు. పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ రవిరాజ్, జీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసునాయక్, సలహాదారుడు నారాయణస్వామి నాయక్, జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, రాయలసీమ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో అనంత బాలోత్సవాలు: డీఈఓ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14, 15, 16వ తేదీల్లో నిర్వహించనున్న అనంత బాలోత్సవంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన అనంత పిల్లల పండుగ-5 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నిత్యం చదువులు, మార్కుల వేటలో సతమతమయ్యే విద్యార్థులకు సృజనాత్మకత, కళానైపుణ్యం వంటివి ప్రదర్శించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బాలోత్సవంలో భాగంగా అకాడమిక్, కల్చరల్, సాంస్కృతిక, జానపద కళలు, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి మొత్తం 62 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందిస్తామని తెలిపారు. వేడుకలకు కవులు, మేధావులు, విద్యావంతులు హాజరై విద్యార్థులను ఉత్తేజపరచాలని కోరారు. బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్, డీఈఓ కార్యాలయ ఏడీ ఆదినారాయణ, బాలోత్సవ కమిటీ నాయకులు ఎల్ ఆర్ రమణ, పరమేష్, చంద్రిక, అశ్విని, సురేష్, సిద్దు, గిరి, భీమేష్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మేకను ఎత్తుకెళ్లిన చిరుత

ధర్మవరం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామ పరిధి రేకులమాను ప్రాంతంలో మేకను సోమవారం చిరుత ఎత్తుకెళ్లింది. మేకల యాజమాని గొల్ల నారాయణస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి తనకున్న 50 మేకలను మేపు కోసం ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామ పొలాల్లోకి తోలుకెళ్లాడు. మేకలు మేస్తుండగా అతడు సమీపంలోని గుట్టమీద కూర్చున్నాడు. ఉన్నఫలంగా మేకలు అరవడంతో కిందికి దిగి చూశాడు. ఓ మేకను చిరుత నోటికి కరిపించుకుని ఈడ్చుకెళ్లడం చూశాడు. దీంతో భయాందోళనకు లోనై మేకలను పక్కకు తోలుకొచ్చాడు. మేకను చిరుత ఎత్తుకెళ్లడంతో రూ.10వేలు నష్టపోయినట్లు నారాయణ స్వామి ఆవేదన చెందాడు. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు భయాందోళనకు లోనవుతున్నారు.

45 గొర్రెపిల్లల మృతి



గొర్రె పిల్లల కళేబరాలను చూపుతున్న కాపరి

రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో చిరుతపులి దాడిలో 45 గొర్రెపిల్లలు సోమవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన కాపరులు ము త్తప్ప, బొమ్మయ్య, గంగాధరలు అయ్యప్ప స్వామి గుడి వద్ద ఉన్న ముత్తప్ప తోటలో గొర్రెల మందను తోలారు. ఉదయం పిల్లలను అక్కడే వదిలేసి గొర్రెలను మేపేందుకు అడవికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో చిరుతపులి దాడి చేసి దాదాపు 45 గొర్రె పిల్లలను చంపింది. మరో పది గొర్రెపిల్లల పరిస్థితి విషమంగా ఉందని కాపరులు చెప్పారు. సుమారు రూ. 2.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు వారు వాపోయారు. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు.

ఎప్పుడు వస్తారో.. పోతారో..?

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- యూరాలజీ డాక్టర్ డుమ్మాకొట్టినా.. హాజరు
- విచారణలో కప్పిపెట్టే యత్నాలు.. చివరికి సరెండర్
- జేసీ తనిఖీల్లోనూ అడ్రస్ లేని వైద్యులు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల తీరుపై విమర్శలు

అనంతపురం టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి జిల్లాకు వరం. గతంలో న్యూరో, కార్డియాలజీ, కిడ్నీ వంటి వ్యాధులతో జిల్లా ఆసుపత్రికి వస్తే కర్నూలు, బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్‌కు రెఫర్ చేసే వాళ్లు. ఇపుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రావడంతో కీలకమైన వ్యాధులన్నింటికీ ఇక్కడ ఉచితంగానే సేవలు అందుతున్నాయి. కానీ ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదన్న విమర్శలు బలంగా ఉన్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.


సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

● మధ్యాహ్నం దాటితే అంతే..

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. ముఖ హాజరు కూడా నిత్యం వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు వైద్యులు 10 నుంచి 10-30 గంటలకు వస్తున్నారు. అప్పటివరకు రోగులు వైద్యుల కోసం పడిగాపులుకాస్తున్నారు. ఇక ఇన్‌పేషెంట్ల పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. డాక్టర్లు మధ్యాహ్నానికే వెళ్లి పోతున్నారు. ఆ సమయంలో ఎంబీబీఎస్ డాక్టర్లే దిక్కుగా మారుతున్నారు. ఒకటిరెండు సందర్భాల్లో సీరియస్ పేషెంట్లు ప్రాణాలు కోల్పోయినట్లు కూడా ప్రచారం ఉంది.


ఇటీవల సూపర్ స్పెషాలిటీలో ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ శివనారాయణశర్మ

● అంతా కుమ్మక్కు..

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓ విచిత్రమైన వ్యవహారం సాగుతోంది. ఇక్కడ పనిచేసే పర్యవేక్షకుల నుంచి డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులు అంతా ఒక్కటై సాగుతున్నారు. ఐక్యతగా ఉండడం మంచిదే.. కానీ ఇక్కడ జరిగే ఏ లోటుపాట్లు బయటకు రాకుండా ఉండేందుకు ఇలా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఓ యురాలజీ డాక్టర్ డ్యూటీకి రాకున్నా కొన్నినెలలు పాటు జీతాలు చెల్లిస్తూ వచ్చారు. ఆ విషయం బయటకు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ విచారణలోను సంబంధిత పర్యవేక్షకులు, వైద్యులు విచారణ కమిటీకి ఆ డాక్టర్ డ్యూటీకి వస్తున్నారని, పైగా మంచిగా సేవలు అందిస్తున్నారని నివేదిక ఇచ్చారు. నివేదిక తర్వాత జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలోను ఆ డాక్టరు డ్యూటీలో కనిపించలేదని, ఎక్కడా ఆ డాక్టరు పిలిపించమన్నా ఇదిగో.. అదిగో వస్తున్నాడని చెప్పి తప్పించినట్లు వైద్య వర్గాల్లో చర్చ సాగుతోంది. చివరకు ఆ డాక్టర్‌ను డీఎంఈకి సరెండర్ చేశారు.

● జేసీ వెళ్లినప్పుడూ కనిపించని వైద్యులు

జాయింట్ కలెక్టర్ శివనారాయణస్వామి శుక్రవారం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలోను డిప్యూటీ సూపరింటెండెంట్ గానీ, వైద్యులు గానీ కనిపించలేదు. చివరికి కార్డియాలజీ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన జేసీ వెంట తిరుగుతూ ఆసుపత్రి విభాగాలను చూపించారు. అప్పుడు కూడా డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు ఎక్కడ అని జేసీ ఆరా తీయగా.. ఏవో కారణాలు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌స్పెషాలిటీకి స్పెషలిస్ట్ డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. ఆ సమయంలోనే నిబంధనల ప్రకారం ఇక్కడ పనిచేసే డాక్టర్లు ప్రైవేట్ ఆసుపత్రులు నడపకూడదని, అందుకుగాను కొంత మొత్తం జీతం పెంచి ఇస్తున్నట్లు ప్రభుత్వం షరతు విధించినట్లు వైద్య వర్గాలు అంటున్నాయి. కానీ, చాలామంది డాక్టర్లు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు నడుపుకుంటూ సూపర్‌స్పెషాలిటీకి సమయ పాలన పాటించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

● ప్రత్యేక దృష్టి పెడతాం



సూపర్ స్పెషాలిటీలో రోగులకు మంచిగా వైద్య సేవలందిస్తున్నాం. అనేక మందికి కీలకమైన ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడాం. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంపైనా ప్రత్యేక దృష్టిపెట్టి పర్యవేక్షణ చేస్తాం. ఇటీవల ఓ డాక్టరుపై ఆరోపణలు రావడంతో ఆయనను సరెండర్ చేశాం. వచ్చిన ఆరోపణలపైనా విచారిస్తాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

క్రైం కార్నర్

యువతి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మమత

గుంతకల్లు టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31 వేడుకలలో చిన్నపాటి వివాదం తలెత్తింది. అది గొడవకు దారితీసి.. ఎ స్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాకా వెళ్లింది. ఇది తన పెళ్లికి అడ్డంకిగా మారుతుందన్న భయంలో గుంతకల్లు సీఐటీయూ కాలనీకి చెందిన బండి మమత సోమవారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు, మమత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు, డిసెంబరు 31వ తేదీ ఉదయం కాలనీలోని సుంకలమ్మ ఆలయం వద్ద సినిమా పాటలు పెట్టారు. దీన్ని ఆ కాలనీకి చెందిన సప్లయర్ సూరి అనే వ్యక్తి ప్రశ్నించాడు. చిన్నారులు అడిగితే తానే పెట్టానని మమత చెప్పడంతో సూరి ఆమెను దూషించాడు. వివాదం చెలరేగడంతో కాలనీ పెద్ద మనుషులు జోక్యం చేసుకున్నారు. సూరితో క్షమాపణలు చెప్పిస్తామని మమతకు నచ్చజెప్పారు. కానీ క్షమాపణలు చెప్పించకపోవడంతో ఈ నెల 4న మమత నేరుగా సూరి ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. సూరి భార్యతో వాగ్వాదం పెరిగి.. ఇరువురు దాడి చేసుకున్నారు. తమను కులం పేరుతో దూషించారని సూరి, అతని భార్య, కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మమత, ఆమె కుటుంబ సభ్యులు, బంధువులపై ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. వచ్చే నెలలో మమత పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేసు కారణంగా పెళ్లి జరుగుతుందో లేదోనని ఆందోళన చెందిన మమత, ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఉదయం విషం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

వృద్ధురాలి హత్య

● టీచర్స్ కాలనీలో దారుణం


సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని టీచర్స్‌కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న పొమ్మల సావిత్రమ్మ(63)ను గొంతుకోసి హత్య చేశారు. ఈ హత్య సోమవారం మధ్యాహ్నం 1.30గంటల నుంచి 4గంటల మధ్యలో జరిగి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. సావిత్రమ్మ భర్త ఓబులేసు అటవీశాఖలో రిటైర్డ్ అయ్యారు. కొన్నేళ్ల కిందటే ఆయన మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్దకుమారుడు విజయ్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ప్రస్తుతం తన కుటుంబంతో కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. రెండో కుమారుడు జయకుమార్, కుమార్తె పూర్ణిమ అమెరికాలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ సోమవారం తన తల్లికి భోజనం క్యారియర్ ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేయడానికి పనిమనిషి రమణమ్మ వచ్చింది. ఎంతసేపు పిలిచినా సావిత్రమ్మ పలకలేదు. దీంతో అడ్డంగా వేసిన డోర్‌ను తెరిచి లోపలికి వెళ్లింది. అక్కడ రక్తపు మడుగులో ఉన్న సావిత్రమ్మను చూసి, వెంటనే విషయాన్ని పెద్దకుమారుడికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో విజయ్‌కుమార్ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, ఎస్‌ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సావిత్రమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసినట్లు చెబుతున్నారు. 2015లో ఆమె ఆ పోస్టుకు రిజైన్ చేసినట్లు సమాచారం.

తెలిసిన వారి పనేనా...?

సావిత్రమ్మ మెడపై పదునైన ఆయుధంతో కోసినట్లు కనిపిస్తోంది. ఆమె మెడలోని బంగారు గొలుసును మాత్రమే లాక్కెళ్లినట్లు తెలుస్తోంది. ఆమె చేతికున్న బంగారు గాజులు, చెవికున్న జుంకీలు అలాగే ఉన్నాయి. ఇంట్లోని బీరువాను పగులకొట్టిన ఆనవాళ్లు కనిపించలేదు. ఈ కోణంలో ఆలోచిస్తే దొంగలు పని కాదని తెలుస్తోంది. ఆ కుటుంబానికి లేదా ఆమెకు తెలిసిన వారే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారనే అనుమానం వ్యక్తమవుతోంది. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ల ద్వారా విచారణ ప్రారంభించారు. హత్యకు సంబంధించిన సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ సాయినాథ్ తెలిపారు.

తాడిపత్రి సబ్ డివిజన్‌లోకి పుట్లూరు, యల్లనూరు

పుట్లూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న పుట్లూరు, యల్లనూరు మండలాలు తిరిగి తాడిపత్రి సబ్ డివిజన్‌లోకి చేరుస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. నాలుగేళ్ల కిందట ఈ మండలాలను అనంతపురం రూరల్ సబ్ డివిజన్‌లోకి మార్చారు. దీంతో సమస్యలపై ఈ రెండు మండలాల నాయకులు, ప్రజలు అవసరాలపై అనంతపురం వెళ్లలేక ఇబ్బందిపడేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ప్రజా ప్రతినిధులకు విషయం చెప్పడంతో వారు ఉన్నతాధికారులతో మాట్లాడి తిరిగి తాడిపత్రిలోకి మార్పు చేయించినట్లు తెలిసింది.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతుసంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి
- కలెక్టరేట్ ఎదుట టమోటాలు పోసి రైతుల ధర్నా


కలెక్టరేట్ ముందు టమోటాలు పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

అనంతపురం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టరేట్ ముందు టమోటాలు పోసి నిరసన తెలిపారు. జిల్లాలో దాదాపు 23 వేల హెక్టార్లలో టమోటా సాగు చేశారని, ప్రభుత్వ మార్కెట్ సౌకర్యం లేక ప్రైవేట్ మార్కెట్లలో తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ నీరున్నా, డ్రిప్ పరికరాలతో ఎన్నో ఇబ్బందుల నడుమ పంటను సాగు చేస్తున్నారని, తీరా మార్కెట్‌కు వచ్చాక గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని, దీంతో రైతులు పొలాల్లోనే పంటను వదిలేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మార్కెట్‌కు తెచ్చినా.. నో సేల్ అనడంతో వదిలేసి వెళుతున్నారని అన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, టమోటా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి.. నామమాత్రంగా కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లాలో ప్రభుత్వం తరపున టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి, రైతులకు పరిష్కారం చూపాలని కోరారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, రైతులు పోతులయ్య, సుబ్బిరెడ్డి, నాగార్జున, చంద్రశేఖర్‌రెడ్డి, రవినారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవితేజ, వెంకట్రామిరెడ్డి, పరమేష్, సుధాకర్, రామలింగారెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా ఆర్‌ఎస్కేలు..!

- సచివాలయాల్లో సిబ్బంది సేవలు
- అక్కడే పంటల నమోదు
- కనిపించని రాయితీ యంత్ర పరికరాలు


నంబులపూలకుంట రైతు సేవా కేంద్రం

నంబులపూలకుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా నిలవాల్సిన రైతు సేవా కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బంది సచివాలయాల్లో పనిచేస్తున్నారు. గత వైసీపీ పాలనలో కొనసాగిన రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) సేవలు రైతులకు పెద్దగా అందింది లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రం (ఆర్‌ఎస్కే)గా పేరు మార్చారేకానీ, సేవలు అందలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ సిబ్బంది కనీసం వాటి బోర్డులను కూడా మార్చలేనంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉన్న పేరుతోనే ఇవి కొనసాగుతున్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో వ్యవసాయానికి అనుసంధానంగా ఉన్న విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ), విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ), విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ (వీఎస్‌ఏ) సిబ్బంది కొనసాగుతున్నారు. వీరు రైతులు సాగుచేసిన పంట పొలాల్లోకి వెళ్లకుండా సచివాలయంలోనే ఉంటూ.. రైతు ఆధార్‌నెంబర్‌తో పంటల నమోదు చేస్తున్నారు. నంబులపూలకుంట మండల వ్యాప్తంగా పదివేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉంది. ఏడు వేల ఎకరాల్లో ఉలవ, మూడువేల ఎకరాల్లో వేరుశనగ, కంది, టమోట, మామిడి, ఇతర ఉద్యాన పంటలు ఉన్నాయి.

ఆర్‌ఎస్కే సేవలేవీ..?

రైతులు ఏ సీజనల్‌లో ఏ పంటలు సాగుచేయాలి.. వాతావరణం, మట్టి నమూనాల ఆధారంగా ఏ పంటలు అనుకూలంగా ఉంటాయి.. మంచి దిగుబడితో ఆర్థికంగా నిలదొక్కుకునే పంటలను ఎంపిక చేసి, వాటిని పర్యవేక్షిస్తూ, సూచనలు, సలహాలు అందించాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాలది. సీఎల్ఎస్ (క్రాప్ లైఫ్ సిస్టమ్) యాప్ ద్వారా పంట నమోదు చేసిన తరువాత, పంటలకు ఆశించిన చీడపీడలపై పర్యవేక్షించాలి. అధికమైతే వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి పిచికారి చేయాల్సిన మందులు, సూచనలు, సలహాలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. రైతులు నష్టపోకూడదన్న లక్ష్యంతో ప్రత్యేకంగా ఆర్‌ఎస్కే కేంద్రాలు ఏర్పాటుచేసి, ఓ భవనాన్ని కూడా నిర్మించారు. ఇటీవల చాలామంది సచివాలయ సిబ్బంది సెలవుపై వెళ్లడంతో వారి పనులను కూడా ఆర్‌ఎస్కే సిబ్బందితో చేయిస్తున్నారు. కంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలంటే సిబ్బంది ఆర్‌ఎస్కేల్లో అందుబాటులో ఉండడం లేదు.



వ్యవసాయ ఉత్పత్తుల నిలువ కేంద్రం

యంత్ర పరికరాల ఊసేలేదు

రైతులకు సబ్సిడీ రూపంలో అందించే ట్రాక్టర్లు, మడకలు, గొర్రు, గుంటకలు, వరి కోత, నూర్పిడి యంత్రాలు, వేరుశనగ నూర్పిడి, పప్పు యంత్రం, టార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు, తెల్లపైపులు సబ్సిడీకి అందేవి. గత వైసీపీ పాలనలో అన్ని మరచిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే పైవాటిని అందిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిప్సం, జింక్ సల్ఫేట్, బోరాన్ బయట కొనుగోలు చేయాలంటే ఎక్కువ ధరలు చెల్లించాల్సి ఉంది. వీటిని కూడా గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. గతంలో టీడీపీ పాలనలో ఉచితంగా జిప్సమ్, మిగిలిన వాటిని ఎక్కువ సబ్సిడీతో అందించేవారు.

వేరుశనగ తడిసి నష్టపోయా



ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంటకు నూర్పిడి సమయంలో వర్షం వచ్చింది. నాలుగు ఎకరాలకు 120 మూటల దిగుబడి వచ్చింది. వేరుశనగ కట్టె, కాయలు తడిసిపోయాయి. దీంతో కొనుగోలుచేసేవారు లేరు. 44 కిలోల బస్తాను రూ.1200కు విక్రయించాను. ఆ సమయంలో మార్కెట్ ధర రూ.2,800 నడుస్తోంది. ప్రభుత్వం కొనుగోలు చేసి ఉంటే ఇంతనష్టం జరిగేదికాదు.

- వెంకటరమణ, నంబులపూలకుంట

ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి



పంట సాగు చేసినప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలి. పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు ఆదుకోవాలి. పరిహారం అందిస్తే తర్వాత పంట సాగుచేసుకోవడానికి కొంత ఊరట లభిస్తుంది.

- నారాయణ, అంబేడ్కర్ నగర్

సిబ్బందిని ఆర్‌ఎస్కేలకే పరిమితం చేయాలి

వ్యవసాయానికి అనుసంధానంగా ఉన్న అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్ సిబ్బంది సేవలను రైతు సేవా కేంద్రాలకే పరిమితం చేయాలి. వీరిని ఇతర పనులకు కేటాయించకూడదు. దీనివల్ల ఈ క్రాప్ బుకింగ్ లక్ష్యాలను పూర్తి చేయలేకపోతున్నాం.

- లోకేశ్వర్‌రెడ్డి, ఏఓ

తేజ ప్రసాద్ కన్నుమూత

- మెడికల్ కాలేజీకి పార్థివ దేహం
- నేడు ప్రెస్‌క్లబ్ నుంచి అంతిమయాత్ర


తేజ ప్రసాద్ (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్/అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు తేజ ప్రసాద్(66) సోమవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన అసలు పేరు నందినేని దేవ ప్రసాద్. 1995 నుంచి దాదాపు 30 ఏళ్లుగా అనేక మీడియా సంస్థల్లో పనిచేశారు. స్ఫూర్తిదాయకమైన కథనాలు రాశారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రవేశించి, తేజ న్యూస్ చానల్ తరఫున సేవలు అందించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయనను తేజ ప్రసాద్, జెమినీ ప్రసాద్ అని పిలుచుకునేవారు. మృదుస్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించాలని నిర్ణయించారు. అనంతపురం నగరంలోని ప్రెస్‌క్లబ్ నుంచి మంగళవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర మొదలవుతుంది.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంతాపం వ్యక్తం చేశారు. జిల్లాలోని తొలితరం జర్నలిస్టు, జర్నలిజానికి తన జీవితాన్ని అంకితం చేసిన దేవ ప్రసాద్ మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంపాటు మీడియా రంగంలో పనిచేసిన ఆయన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.

● సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మాజీ మంత్రి, దివంగత పరిటాల రవీంద్రకు అత్యంత సన్నిహితులని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయనకు కుటుంబ సభ్యులు లేకున్నా.. జర్నలిస్టులే కుటుంబమని, ఆయన జ్ఞాపకార్థం చేయాల్సిన పనులకు తమ కుటుంబం సహకరిస్తుందని తెలిపారు.

చీనీ టన్ను రూ. 26 వేలు



అనంతపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26 వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8 వేలు, సరాసరి రూ. 15 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 37 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ఉద్యోగాలకు 228 మంది ఎంపిక

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 228మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతర్జాతీయ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్‌లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. నైపుణ్యాలను, సామర్థ్యాలను అంచనా వేసేందుకు పోటీ పరీక్షలు, ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారని తెలిపారు. ఈ ప్రక్రియలో మెకానికల్ ఇంజనీరింగ్ 75, ఆటోమొబైల్ 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 75, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ 67 మొత్తం 228మంది విద్యార్థులు ప్రతిభను కనబర్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. నెలకు రూ.18500 వేతనంతోపాటు రూ.1500 హాజరు బోనస్, రూ.12వేలు వార్షిక బోనస్ చెల్లిస్తారని తెలిపారు. ఉచిత రవాణా, భోజన సౌకర్యాన్ని కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఓవియా, ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, విభాగాధిపతులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 767 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 448 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

పల్లెలకు పూర్వవైభవం



వేమారెడ్డిపల్లిలో వేసిన సీసీ రోడ్డు

కూటమి రాకతో పల్లెలకు మళ్లీ పూర్వ వైభవం వచ్చినట్లైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టడంతో గ్రామాలు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. నిధులు లేకపోవడంతో కనీసం వీధిలైట్లకు మరమ్మతులు కూడా చేయించుకోలేని దుస్థితికి చేరుకున్నాయి. ఇక గుంతల రోడ్లు... నీటి సమస్యలు.. తదితర వాటితో గ్రామీణులు ఇబ్బందులు పడ్డా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. కూటమి రాకతో గ్రామీణ సమస్యలపై దృష్టి సారించింది. అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రూ. కోట్లు కేటాయించింది. దీంతో పల్లెలు పూర్వవైభవాన్ని సంతరించుకొంటున్నాయి.

- కూటమి రాకతో.. రూ.కోట్లతో అభివృద్ధి పనులు
- వేగంగా సీసీ రోడ్ల నిర్మాణాలు
- పలు సమస్యలు పరిష్కారం

వనుకువారిపల్లిలో వేస్తున్న సీసీ రోడ్డు



ఓబుళదేవరచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు... నేడు అభివృద్ధి బాట పట్టాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల వీధుల్లో కనీసం సీసీ రోడ్లు కూడా వేయకపోవడంతో ఎగుడు దిగుడు... గుంతలు.. గుంతల రోడ్లతోనే కాలం గడిపారు. మురుగుకాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా గ్రామీణ వీధులన్నీ బురదమయం అయ్యేవి. వీధుల్లోనే మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులు చేపట్టింది. మండలంలోని రూ. మూడు కోట్లతో ఈ పనులు ప్రారంభించారు. దీంతో గ్రామాలకు కొత్త కల వచ్చింది. గ్రామ వీధిల్లో సీసీ రోడ్లు వేస్తుండటంతో ఆ గ్రామ రూపురేఖలే మారుతున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలను మరింత అభివృద్ధి చెందుతున్నాయి.

● రూ.కోట్లతో అభివృద్ధి

మండలంలో రూ. కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండలానికి రూ. మూడు కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఓడీసీ పంచాయతీకి రూ. 1.20 కోట్లు, వెంకటాపురం పంచాయతీకి రూ.19.25 లక్షలు, తంగేడుకుంటకు రూ.2 లక్షలు, శేషయ్యగారిపల్లి రూ. మూడు లక్షలు, తుమ్మలకుంట్లపల్లికి రూ.8లక్షలు, మిట్టపల్లికి రూ.27లక్షలు, తిప్పేపల్లికి రూ.24లక్షలు, ఇనగలూరు రూ.30.75 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈపనులన్నీ మార్చి 31లోపు పూర్తికావాలని అధికా రులు ఆదేశించారు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలుకావడంతో మరిన్ని కొత్త పనులు మంజురయ్యే అవకాశముంది.

● కాంట్రాక్టర్లల్లో ఉత్సాహం

గతంలో గుంతల రోడ్లు, రోడ్లపై మురుగు నీటి నిల్వ తదితర సమ్యలు పరిష్కరిం చడంలో భాగంగా ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ పనులు చేయడానికి కాంట్రాక్టర్లూ ఉత్సహంగా ముందుకు వస్తున్నారు. గత వైసీపీ ప్రభు త్వంలో పనులు చేస్తే.. బిల్లులు వస్తాయో.. రావో అనే భయంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు వచ్చేవారు కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుండటంతో కాంట్రాక్టర్లు ఆ పనులు చేయడానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

పల్లెలు బాగుపడ్డాయి



గతంలో గ్రామాల్లో రోడ్లన్నీ గుంతలు... గుంతలే. వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. వానస్తే వీధులన్నీ బురద.. బురద. నీరు నిల్వ ఉండి.. దుర్వాసన వచ్చేది. దోమలు బాగా పెరిగాయి. ఇప్పుడు సీసీ రోడ్లు.. మురుగు కాలువలను నిర్మిస్తున్నారు. సమస్యలు పరిష్కార మయ్యాయి. పల్లెలు బాగుపడ్డాయి. అసలు ఊహించని రీతిలో గ్రామాలకు కల వచ్చింది.

- కాయల రామాంజనేయులు, బాబాసాహెబ్‌పల్లి

సమస్యల పరిష్కారం



గతంలో గ్రామాల్లో అనేక సమస్యలుండేవి. పంచాయతీలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ సమస్యలను పరిష్కరించేవారు కాదు. ముఖ్యంగా రోడ్లు అధ్వానంగా ఉండేవి. జారిపడి అనేక మంది గాయపడ్డారు. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం గ్రామసభలో గుర్తించిన ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు వేయిస్తోంది. దీంతో ప్రమాదాలకు ఎలాంటి అవకాశం లేదు.

- వాల్మీకి నాగవేణి, మిట్టపల్లి

న్యూస్ బాక్స్

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలను శనివారం వరకూ నిర్వహిస్తామన్నారు. మంగళ(వారం సాయంత్రం పుణ్యాహ వాహనం, కలస స్థాపన, రక్షాబంధన, బుధవారం హోమాలు, గురువారం ఆంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠ, శుక్రవారం అభిషేకాలు, అర్చనలు, వైకుంఠ ద్వారా ప్రవేశం, సాయంత్రం తిరుకల్యాణోత్సవం, శనివారం శాంతిహోమాలు, పూర్ణాహుతి, బలిహారణం, కలస ఉద్వాసన, మహామంగళహారతి ఉంటుందన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

కొత్తచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బేటీ బచావో.. బేటీ బడావో, కిశోరీ వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, సీఐ ఇందిరా అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడారు. బాల్యవివాహాల అడ్డుకట్టకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలకు, మహిళా పోలీసులకు సమాచారం అందుతున్నా వాటిని అడ్డుకోలేకపోతున్నారని, కనీసం ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తే ఆ బాల్యవివాహాలను అడ్డుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చలపతి, పీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ ఆంజనప్ప, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఈఓఆర్డీ మాధవ రెడ్డి, వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, మహిళ పోలీస్ లలితమ్మ, సమత, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి ఉమాశంకర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● బత్తలపల్లి : స్థానిక ఎండీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులకు కిశోర వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో సీడీపీఓ సరస్వతి, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ శ్రీనివాసులు, ఎంఈఓ చాముండేశ్వరి, ఉపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● బుక్కపట్నం : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కిషోరి బాలికల వికాస కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పుట్టపర్తి సీడీపీఓ గాయత్రి, ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మీ, ఎస్ఐ క్రిష్ణమూర్తి ఇందులో పాల్గొన్నారు. వారు మండలస్థాయి శిక్షణకులకు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళ పోలీసులకు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం జగదీష్, మహిళ పోలీస్ విజయలక్ష్మీ, ఏపీఎం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి దీక్షకు మద్దతు

ధర్మవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ పట్టుచీరల పాలిస్ కార్మికుడు బీఎల్ నరసింహులు చేపట్టిన దీక్ష సోమవారానికి 17వ రోజుకు చేరింది. ఈ దీక్షకు టీడీపీ నాయకులు తలారి చంద్ర మోహన్, ముత్యాలు, తారక్ మద్దతు ప్రకటించారు.



దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

జీతాల కోసం స్వచ్ఛభారత్ కార్మికుల నిరసన

ఓబుళదేవరచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తమకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, వెంటనే వాటిని మంజూరు చేయాలని స్వచ్ఛ భారత్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ నాయకుడు కుళ్లాయప్ప, స్వచ్ఛభారత్ కార్మికులు ఆంజనప్ప, నిర్మల, శ్రావణ తదితరులు మాట్లాడుతూ.. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకున్నా.. తాము విధులు నిర్వహిస్తున్నామన్నారు. అధికారులు ఏమాత్రం జీతాలు ఇవ్వడంతో చొరవ చూపలేదని ఆవేదన చెందారు. స్వచ్ఛ భారత్ క్లాప్‌మిత్ర కార్మికులకు తొమ్మిది నెలలు, స్వచ్ఛ భారత్ కార్మికులకు ఏడు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఈఓఆర్డీ కేశవరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వభారత్ కార్మికులు సాలెమ్మ, బాగమ్మ, ఓబులమ్మ, నాగమ్మ, రామయ్య పాల్గొన్నారు.



ఈఓఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, స్వచ్ఛభారత్ కార్మికులు

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిమర్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసు గు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవా రం ధర్నా చేపట్టారు. మధు మాట్లాడుతూ.... అర్హులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని, గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గృహనిర్మాణాల కోసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. పొలాలకు రహదారులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, దాసు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్య, నాయకులు పెద్దన్న, వసూరప్ప, రాములు, నాగభూషణ, సూరి పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

మిల్లర్ కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు

నల్లచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో సీసీరోడ్డు వేస్తుండగా హైజాక్ మిల్లర్ కిందపడి అదే గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి సోమవారం తీవ్రంగా గాయపడ్డాడు. కమ్మరవారిపల్లిలో సిమెంటు రోడ్డు వేస్తుండగా సిమెంటు, కంకర కలిపే యంత్రం కింద పడి గాయపడ్డాడు. ఆ వ్యక్తి చెవిటి, మూగ కావడంతో ఈప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గాయపడిన ఆ వ్యక్తిని ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి..

బుక్కపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూనిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రిష్టాపురం గ్రామానికి చెందిన రమణ తీవ్రంగా గాయపడ్డాడు. బుక్కపట్నం నుంచి తన స్వగ్రామమైన క్రిష్టాపురానికి బైక్‌పై వెళ్తుండగా... గూనిపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి.. కిందపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ క్రిష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేయడంతో.. ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

బైక్‌లు ఢీకొని...

ధర్మవరంరూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి క్రాస్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు సోమవారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. ధర్మవరం పట్టణం మార్కెట్ వీధికి చెందిన నరేష్ తన బైక్‌లో అనంతపురం నుంచి ధర్మవరానికి వస్తుండగా... గొల్లపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరేష్‌ను స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఓబుళదేవరచెరువు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రాకు ఒక సుమో, ఒక కారులో తరలిస్తున్న 4,264 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి మహమ్మదాబాద్‌క్రాస్‌లో వాటిని స్వాధీనం చేసుకున్నామని, సుమో, కారును సీజ్ చేశామని, ఐదుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐతో పాటు జమేదార్లు వెంకటేష్, రమణ, పోలీస్ సిబ్బంది కోలా ఆంజి, లోకేష్ పాల్గొన్నారు.

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు



బుక్కపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కురుబలు రాజకీయంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

బీసీ సంక్షేమ సంఘం డైరెక్టర్ ఏకగ్రీవం

ధర్మవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం పట్టణ డైరెక్టర్‌గా సత్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేశ్ తెలిపారు. స్థానిక షిర్డీసాయి బాబా ఆలయం సమీపంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో అతడిని ఎంపిక చేసినట్లు చెప్పారు. సత్యంకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వేలం పాటతో ఆదాయం

నల్లచెరువు, జనవరి6 (ఆంధ్రజ్యోతి) : పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి దేవాస్థానంలో టెంకాయలు, పూజా సామగ్రి , పూల హారాలు, విడిపూలు విక్రయించుకోవడానికి సోమవారం ఈఓ పి.నరసింహరాజు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. టెంకాయల రూ.2.60 లక్షలకు రెడ్డెప్ప దక్కించుకున్నారు. పూలహారాలు, విడిపూలు విక్రయించుకోవడానికి రూ28 వేలకు బి. సాంబశివ దక్కించుకున్నారు. సంవత్సరానికి (శ్రావణమాసం మినహాయించి) ఈ వేలం నిర్వహించినట్లు ఈఓ, పర్యవేక్షణాధికారి బి. వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవిగా వాసవీమాత



తాడిమర్రి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ధనుర్మా సాన్ని పురస్క రించుకుని తాడిమర్రిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి మూల విరాట్‌కు సోమవారం గోదాదేవి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మ వారికి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని పూజలు చేయించారు.

రైతులకు పరీక్ష..!



కొత్తచెరువులో ప్రారంభానికి నోచుకోని వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ భవనం

భూసార పరీక్ష.. దీని ద్వారా పొలంలో ఏ..ఏ.. ఖనిజాలు.. లవణాలు తక్కువగా ఉన్నాయి. ఏ ఎరువులు వాడితే మంచి దిగుబడి వస్తుంది. ఏ ఎరువులు వేస్తే భూసారం పెరుగుతుంది.. తదితర విషయాలు తెలిసేవి. గతంలో ఉన్న భూసార, నీటి పరీక్షల ల్యాబ్‌లకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేయలేదు. దీంతో అవి మూతబడ్డాయి. వాటి స్థానంలో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్‌లను ఆర్భాటంగా ఏర్పాటు చేసింది. అయితే వాటికీ పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో.. సిబ్బందిని నియమించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో భూసార పరీక్షలు చేయించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- నిరుపయోగంగా వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు
- సిబ్బందినీ నియమించని వైనం
- పెట్టెలకే పరిమితమైన పరీక్ష పరికరాలు
- భూసార పరీక్ష చేయించుకోవాలంటే అనంతకు వెళ్లాల్సిందే
- రూ. లక్షల ప్రజాధనం వృథా
- కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి వచ్చేనా..?

ధర్మవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన భూసార పరీక్ష, నీటి నమూనా ప్రయోగశాలలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం చేసింది. వాటి స్థానంలో వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసింది. తమది రైతు ప్రభుత్వమని, వ్యవసాయంలో నూతన మార్పులు తీసుకువస్తామని, నకిలీ ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలకు కళ్లెం వేస్తామని.. సభలు, సమావేశాల్లో వైసీపీ పాలకుల ప్రగల్భాలు పలికారు. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను లక్షలాది రూపాయిలు వెచ్చించి భవనాలను నిర్మించారు. అందులో కొన్నింటిని మాత్రమే ప్రారంభించారు. మిగిలినవి ప్రారంభించలేదు. ఆయా ల్యాబ్‌లకు పరికరాలను సైతం పంపిణీ చేశారు. అయితే వాటిని ఏర్పాటు చేసుకోవడానికి ఫర్నీచర్, విద్యుత్ పరికరాలు సరఫరా చేయకపోవడంతో ఆ పరికరాలు కాస్తా పెట్టెలకే పరిమితమయ్యాయి. దీంతో భూసార, నీటి పరీక్షలు చేయించుకోలేక రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్షలాది ప్రజాధనం వృథా అయినా ఫలితం లేకుండా పోయింది.

● పరీక్షలకు అనంతకు వెళ్లాల్సిందే

2014లో కదిరి, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో భూసార పరీక్ష, నీటి నమూనా ప్రయోగశాలలు ఉండేవి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో అవి కాస్తా మూతపడ్డాయి. దీంతో సత్యసాయి జిల్లాలోని రైతులు భూసార పరీక్ష, నీటి నమూనా చేయించుకోవాలంటే అనంతపురానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యయ ప్రయాసలు పడి మట్టి, నీరు ప్రయోగశాలకు తీసుకెళ్లితే అక్కడ అధికారులు మాత్రం నెలల అనంతరం ఆ ఫలితాలను ఇస్తున్నారు. దీంతో సరైన ఫలితాలు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

● ల్యాబ్‌ల్లో సిబ్బంది ఎక్కడా.. ?

గత వైసీపీ ప్రభుత్వం అగ్రి టెస్టింట్ బోర్డు ల్యాబ్‌లలో నకిలీ ఎరువులను, పురుగుమందులను, విత్తనాల నాణ్యతను తెలుసుకునేందుకు ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా పశువులకు సోకే రోగాలను ఇతర వైరస్ జబ్బులను పరీక్షించి రైతులకు ఒకే చోటే అన్ని సేవలు అందించే విధంగా ముందడుగు వేసింది. అయితే భవనాలు మాత్రమే నిర్మించి అరకొర పరికరాలను మాత్రమే సరఫరా చేసి గత వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీనికి తగ్గ సిబ్బందిని సైతం నియమించకపోవడంతో ల్యాబ్‌లు వృథాగా మారాయి.

● కూటమి ప్రభుత్వంలోనైనా వినియోగంలోకి వచ్చేనా

లక్షలాది రూపాయిలతో నిర్మించిన వైఎస్ఆర్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లను కూటమిప్రభుత్వం వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. వాటిని వినియోగంలోకి తెస్తే భూసార పరీక్ష, నీటిపరీక్షల కోసం అనంతపురంకు వెళ్లే పరిస్థితి తప్పుతుంది. ముఖ్యంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, పరీక్షలు లేకపోవడంతో ఎరువుల దుకాణాల వారు నకిలీ ఎరువులను రైతులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ల్యాబ్‌లు వినియోగంలోకి వస్తే తప్పా వాటికి అడ్డుకట్టపడే పరిస్థితి లేదు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ల్యాబ్‌లకు ఫీర్నీచర్ కూడా వచ్చింది. అదే పెనుకొండ, ధర్మవరం ప్రాంతాల్లో భూసార, నీటి పరీక్షా కేంద్రాలకు నిధులు లేక పనిచేయడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే భూసార పరీక్షా కేంద్రాలను కూడా వినియోగంలోకి తెస్తాం. విడతల వారీగా పెనుకొండ, ధర్మవరం భూసార పరీక్ష కేంద్రాలకు నిధులు వచ్చేలా చర్యలు చేపట్టి వినియోగంలోకి తెస్తాం.

- సుబ్బారావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి





కొత్తచెరువులో ఫర్నీచర్, పరికరాలు లేక ఖాళీగా ఉన్న ప్రయోగశాల, అట్టపెట్టెలకు పరిమితమైన పరికరాలు

న్యూస్ బాక్స్

ఎన్నికల బిల్లులు చెల్లించండి



ఎన్నికల బిల్లులు చెల్లించాలని కోరుతున్న బాధితులు

పెనుకొండ టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోసం ఖర్చు చేసిన బిల్లులు చెల్లించాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు బాధితులు వినతి పత్రం అందించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందించిన అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో భోజనాలు, బారికేడ్లు, షామియానా, రవాణా తదితర వాటికి రూ.53లక్షల దాకా ఖర్చుపెట్టినట్లు తెలిపారు. ఇప్పటికీ రూ.10.75 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకపోయిందన్నారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు గడిచినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరామన్నారు.

నిందితుడి అరెస్ట్

పరిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ ఉప్పర సునీల్‌కుమార్ అనే యువకుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సోమవారం ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. ఏడేళ్ల చిన్నారిపై సునీల్ కుమార్ అత్యాచారయత్నానికి పాల్పడ్డంతో ఆదివారం అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. దర్యాప్తు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచామన్నారు. న్యాయాధికారి నిందితుడికి రిమాండు విధించారని, రౌడీషీటరు ఓపెన్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

లైన్‌మన్‌పై దాడి

గోరంట్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు విద్యుత్‌శాఖ లైన్‌మన్ వెంకటేష్, సహాయకుడు శ్రీరాములుపై పెరమాళ్లపల్లికి చెందిన వ్యక్తి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ సోమవారం తెలిపారు. గోరంట్లకు చెందిన లైన్‌మన్ వెంకటేష్, సహాయకుడు శ్రీరాములుతో కలిసి ఆదివారం పెరుమాళ్లపల్లిలో మహబూబ్‌బాషా అనే వ్యక్తి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లారు. దరఖాస్తుకు సంబంధించి డాక్యుమెంట్ల విషయంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మహబూబ్‌బాషా ఇరువురిపై దాడిచేశాడు. హెల్పర్ శ్రీరాములు తలకు, చేతికి రక్తగాయాలయ్యాయి. వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

అమరాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్నడుకు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గుడిబండ మండలం దాసరిపల్లికి చెందిన నాగరాజు, రత్నమ్మ దంపతులు తమ కుమార్తె పూర్ణిమను పాఠశాలలో వదిలి వెళ్లడానికి రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో అమరాపురం నుంచి సహకార సంఘంలో విధులు నిర్వహిస్తున్న పుట్టపర్తికి చెందిన చెన్నకేశవులు ద్విచక్ర వాహనంలో రావడంతో ఢీకొన్నారు. ఇందులో నాగరాజు కుమార్తె పూర్ణిమకు, చెన్నకేశవులుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజు భార్య రత్నమ్మకు, చెన్నకేశవులు కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. తక్షణమే 108 వాహనానికి సమాచారం అందించి మడకశిర ఆస్పత్రికి తరలించారు. మడకశిర నుంచి హిందూపురం ఆస్పత్రికి మెరుగైన వైద్య సేవల కోసం తరలించినట్లు బంధువులు తెలిపారు.

కిశోరి వికాసంపై శిక్షణ

సోమందేపల్లి/అమరాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ బాలికల భవిష్యత్తుకు పునాదులు వేసి ఉన్నత విద్య ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను నిర్మూలించి వారిని పాఠశాల వైపు మళ్లించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ మహిళా పోలీసు కన్వీనర్‌గా కిశోరిబాలికల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 11 నుంచి 18సంవత్సరాలలోపు మహిళల విద్యా ఆరోగ్యం, భద్రత ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం విజయశంకర్‌రెడ్డి, ఏఎస్ఐ మురళి తదితరులు పాల్గొన్నారు. అమరాపురంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, మండల విద్యాశాఖాధికారి వెంకటరమణనాయక్, సీడీపీఓ శాంతలక్ష్మీ పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారు.. న్యాయం చేయండి

పెనుకొండ రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తమ పూర్వీకుల నుంచి ఎన్నోఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని కబ్జా చేశారని, తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రొద్దంకు చెందిన పెద్ద మహ్మద్, చిన్న మహ్మద్ కుటుంబికులు వాపోయారు. సోమవారం రొద్దం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు షరీఫ్, షాను, షబీన, షాహీన మాట్లాడుతూ.. 1959 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పెద్ద మహ్మద్ పేరిట సర్వేనంబరు 166-13లెటర్‌లో 4.85 ఎకరాలు, చిన్నమహ్మద్ పేరిట సర్వే నంబరు 166-14లో 4.10ఎకరాలు ఇచ్చిందన్నారు. తమ ఆధీనంలో ఉన్న భూమిని రొద్దం గ్రామానికి చెందిన చాకలి నాగన్న కుమారుడు డీలర్ ఉమాశంకర్, అతడి భార్య పేరుమీద ఎనిమిది నెలల క్రితం 1బీలు చేయించుకుని కబ్జా చేశారన్నారు. భూవివాదంలో ఎస్‌ఐ నరేంద్ర కబ్జాచేసిన ఉమాశంకర్‌కు ఒత్తాసు పలుకుతున్నాడని తెలిపారు. అనంతరం రొద్దం తహసీల్దార్ నాగేంద్రకు వినతిపత్రం అందించారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

హిందూపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అబాకస్ పోటీల్లో హిందూపురం జ్ఞానజ్యోతి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సత్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ధర్మవరంలో జరిగిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో పాఠశాలకు చెందిన సహస్ర 5వ గ్రేడు, దినేష్ మూడో గ్రేడు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మొక్కజొన్న రైతుకు నిరాశే..!

● పంట పండినా దక్కని గిట్టుబాటు ధర ● సొమ్ము చేసుకుంటున్న దళారులు





రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న, వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు

పరిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విత్తనం వేసినప్పటి నుంచి రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించిన రైతులకు చివరికి నిరాశే మిగులుతోంది. ఒకవైపు అతివృష్టి, మరోవైపు అనావృష్టి, చీడపీడలను తట్టుకుని పంట చేతికొచ్చినా గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పరిగి మండల వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను పండించారు. తీరా పంట చేతికందే సమయానికి ధరలు పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందడంలేదు. నిత్యం పంట నష్టాలను భరించలేక మండలంలోని కొందరు రైతులు భూములు బీడుగా వదిలేసి బెంగళూరులో సెక్యూరిటీగార్డ్, భవన నిర్మాణ కార్మికులుగా వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు క్వింటాలు మొక్కజొన్న రూ.2,200కు దళారులకు అమ్ముకుంటున్నారు. దాదాపు 30 ఏళ్ల తరువాత చెరువు నిండడంతో కట్టకింద చిన్నపల్లి, విట్టాపల్లి, పైడేటి గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పండించారు. పంట చేతికందే సమయంలో ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరికొందరు పండించిన మొక్కజొన్న పంటను ఇళ్లవద్దే నిలువ చేసుకుంటున్నారు.

ప్రభుత్వ కేంద్రాలకు రైతులు రాలేదు : విజయభారతి, ఏఓ

మొక్కజొన్న పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.2,216 నిర్ణయించింది. దళారులు రైతుల వద్దకు వెళ్లి మొక్కజొన్న క్వింటాల్ రూ.2200కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కేంద్రాల వద్దకు వచ్చేందుకు రైతులు మక్కువ చూపడంలేదు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ ప్రభుత్వానికి విన్నవిస్తాం.

ఇంటివద్దే నిల్వ చేసుకుంటున్నాం: ఆది, రైతు, పైడేటి



లక్షల రూపాయలు వెచ్చించి మొక్కజొన్న పంట సాగుచేశానని గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను తక్కువ ధరకు అమ్ముకోలేక ఇంటివద్దే నిలువ చేసుకున్నాం. ధరలు పెరిగిన తరువాత విక్రయిస్తాం. ప్రభుత్వం రైతుల ఇబ్బందులు తెలుసుకుని మద్దతు ధర పెంచాలని కోరుతున్నాం.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గుడిబండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు సుజాతమ్మ కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడు నాగేంద్రప్ప, సురేష్, దాసేగౌడ్‌ను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సోమవారం పరామర్శించారు. తిరుమల, తిరుపతి వెంకటేశ్వరస్వామి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బుళ్లసముద్రం గ్రామ సమీపంలో టీటీ వాహనం నిలుచుకొన్న లారీని ఢీకొనడంతో ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. నాగేపల్లికి చేరుకొని సుజాతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, నాయకులు మద్దనకుంటప్ప, వీఎం పాండురంగప్ప తదితరులు ఉన్నారు.



సుజాతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

తాగునీటి కోసం మహిళల ధర్నా



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

రొళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నగిరి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సచివాలయం ముందు మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు సోమారం రోడ్డుపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొన్న ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ బాబూరావు వెంటనే స్పందించారు. నీటి నిల్వలపై పైప్‌లైన్ లీకేజీలను వెంటనే పరిష్కరించారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

హిందూపురం/సోమందేపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా బేవనహళ్లి ఆనంద్ కుమార్, డీవీ అంజనేయులు ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని బీసీ భవన్‌లో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ద్వారా నిధులు అధికంగా తీసుకొచ్చి నియోజకవర్గంలో వెనుకబడిన వాల్మీకులకు రుణాలు ఇస్తామని తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, డాక్టర్ సురేంద్ర, హిందూపురం నియోజకవర్గం టీడీపీ కోఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమందేపల్లికి చెందిన డీవీ అంజనేయులు మాట్లాడుతూ.. తమకు సహకరించిన చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న బేవనహళ్లి ఆనంద్‌కుమార్, డీవీ అంజనేయులు

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావు అన్నారు. హిందూపురం నియోజకవర్గంలోని 16 మంది బాధితులకు రూ.19లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి బాధితులకు ఒక వరం అన్నారు. రాష్ట్రంలోని పేద వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, అశ్వత్థనారాయణరెడ్డి, చంద్రమోహన్, అమర్నాథ్, హెచ్‌ఎన్ రాము, మంజునాథ్, సతీష్, వెంకటేశ్, నవీన్, బాచి, చెన్నమ్మ పాల్గొన్నారు.



డివైడర్‌పైకి ఎక్కిన లారీ

డివైడర్‌ను ఢీకొన్న లారీ

మడకశిరటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చౌటిపల్లి వద్ద సోమవారం ఉదయం పెనుకొండ నుంచి మడకశిరకు సిమెంటు లోడుతో వస్తున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌పైకి ఎక్కింది. డ్రైవర్ అతివేగంగా రావడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

గుంతల రోడ్లకు విముక్తి లేదా..?

హిందూపురం అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నిత్యం గుంతల రోడ్లలో ప్రయాణించలేకపోతున్నామని, ఈ రహదారులకు విముక్తి లేదా అని హౌసింగ్ బోర్డు ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందరితోపాటు తాము కూడా పన్నులు సక్రమంగా కడుతున్నామని, తమపై వివక్ష ఎందుకని అన్నారు. విలాసవంతమైన ప్రాంతంగా పేరు ఉంది కానీ అన్నీ ఇబ్బందులే అన్నారు. గుంతల రోడ్లలో ప్రయాణం నరకంగా ఉందని, వర్షాకాలం వచ్చిందంటే అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. కనీసం తాగునీరు సక్రమంగా వదటడంలేదని ఫిర్యాదులు చేస్తున్నారు. 10 రోజులకోమారు నీరు వదులుతారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్లు, అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని మట్టిరోడ్డు

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

- మాజీమంత్రి రఘువీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల క్రీడాకారులకు సోమవారం రూ. లక్ష విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

పెనుకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెనుకొండలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, భవిష్యత్తు నిధి, ఏపీజీఎల్ లోన్లు, సరెండర్ లీవ్‌ల మొత్తాలు వెంటనే చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి 30శాతం చెల్లించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా హెచ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేష్‌నాయక్, జాయింట్ సెక్రటరిగా వలీవుల్లా, కోశాధికారిగా శెహనాజ్‌బాను, కార్యదర్శులుగా వెంకటేష్, వరప్రసాద్, రాధమ్మ, హేమలత, విజయలక్ష్మీ, ఉపాధ్యక్షులుగా వెంకటనాయక్, విశ్వనాథ్, సునీతమ్మ, సత్యవతి, జిల్లా కౌన్సిలర్‌గా శ్రీనివాసు లు, నరేష్‌కుమార్, విజయ్‌కుమార్‌నాయక్, శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం

పరిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిందు నగర్‌కు చెందిన నారాయణరెడ్డి (78) అనే వృద్ధుడు కనిపించలేదని కుమారుడు మారుతిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఈనెల 2వ తేదీ నుంచి వృద్ధుడు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో నాలుగు రోజుల నుంచి చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినట్లయితే పరిగి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

9న సామాజిక తనిఖీపై బహిరంగ సభ

రొళ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈనెల 9న సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు, ఎస్‌ఆర్‌పీ తిరుమలేష్ తెలిపారు. మండల వ్యాప్తంగా పది పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 577 పనులకుగాను రూ.4.51 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులకు చేపట్టిన పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయంపై తనిఖీ బృందం పరిశీలించి నివేదికను అందజేస్తుంది.

దళారులను నమ్మి మోసపోవద్దు : తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్

పెనుకొండ టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామంటున్న దళారులను నమ్మి మోసపోవద్దంటూ తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీ సర్వేనంబరు 264 మేజర్ హౌసింగ్ కాలనీ సర్వేనంబరు 263, 262, 228, మడకశిర రోడ్డు జర్నలిస్ట్ కాలనీ సర్వేనంబరు 668లో ఇళ్ల పట్టాలు, స్థల ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామంటూ కొంతమంది దళారులు పేదప్రజలను మభ్యపెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దళారుల మాటలకు మోసపోవద్దని సూచించారు. ఎవరైనా పట్టాలు ఇప్పిస్తామని చెప్పినట్లు ఫిర్యాదులు వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాగి పంటతో రైతులకు లబ్ధి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

అగళి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాగి పంట సాగు చేయడం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని రావుడి గ్రామంలో రాగి పంట సాగుపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు పండించిన రాగి పంటను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఖాతాల్లో డబ్బు జమచేస్తుందని తెలిపారు. క్వింటాల్ ధర రూ.4,239 నిర్ణయించినట్లు వివరించారు. ప్రతి రైతు రాగి పంట సాగు చేసుకుని ని లబ్ధి పొందాలని సూచించారు. ప్రభుత్వమే రాగి విత్తనాలను సరఫరా చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శివకుమార్, పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలికల ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి. ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న నాలుగో ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమ వారం మూడోరోజు కొనసాగాయి. లిబర్టీ లేడీస్ తమిళనాడుపై గుజరాత్ స్పోర్ట్స్ అథారిటీ జట్టు 20గోల్స్ తేడాతో, పెన్నా ఏపీపై నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ జట్టు 8గోల్స్ తేడాతో విజయం సాధించాయి. అలాగే నంది ఫౌండేషన్ గుజరాత్‌పై కంపాసిన్ 26గోల్స్ తేడాతో, ఫాల్కన్‌గర్ల్స్ ఒడిశాపై బెంగుళూరు 2 గోల్స్ తేడాతో, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై తమిళనాడు థామ్ 14గోల్స్ తేడాతో గెలుపొందాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో నూతన రూసా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పా టుచేశారు. సోమవారం రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఇంజనీ రింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, సీడీసీ డీన్ రామ గోపాల్ ప్రారంభించి మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులకు కం ప్యూటర్ కోర్సులు నేర్పించేందుకు అధునాతన వర్షన్‌తో కూడిన కంప్యూటర్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.